

ఘనంగా కుంకుమపూజలు

కోరుట్లటౌన్: శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా మంగళవారం కుంకుమ పూజలు ఘనంగా చేశారు.



చెన్నకేశవునికి మొక్కులు

రాయికల్ : జిల్లా జడ్జి నీలిమ, కుటుంబసభ్యులు మంగళవారం స్థానిక పురాతన చెన్నకేశవనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.0/18.0

ఆకాశం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్ పర్యటన

కోరుట్లరూరల్: మోహన్‌రావుపేటలో అదనపు కలెక్టర్ మకరంద్ మంగళవారం పర్యటించారు. తొలుత కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించారు. లైట్లు ఏర్పాటు చేసి వెలుతురు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తర్వాత పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఉన్నత పాఠశాలకుచేరుకుని సైన్స్‌ఫేర్ ప్రాజెక్టులు పరిశీలించారు. ప్రాజెక్టుల గురించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకొని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నీరజ, సర్పంచ్ సరికెల్ల మల్లారెడ్డి, ఏపీవో మమత పాల్గొన్నారు.

నేడు వార్డుసభలు

జగిత్యాల: జిల్లాలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపేందుకు మార్చి 1న వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సభలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా మంగళవారం తెలిపారు. ఉదయం 8 – మధ్యాహ్నం 1 గంట వరకు సభలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు కేటాయిస్తామన్నారు. అర్జీదారులు ఆధార్, ఓటరు కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, రేషన్‌కార్డులు, పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

పనులు పూర్తిచేయండి



పనులు పరిశీలిస్తున్న రామానుజాచార్యులు

కొడిమ్యాల(చొప్పదండి): స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో చేపట్టిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు సూచించారు. భవన నిర్మాణాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. సింగిల్‌విండో చైర్మన్ మేనేని రాజానర్సింగారావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పొనుగోటి కృష్ణారావు, వైస్ ఎంపీపీ పర్లపెల్లి ప్రసాద్, మేనేజర్ నవాబ్, సీఈవో ఉన్నారు.

విజ్ఞానంతో సమాజ వికాసం



మాట్లాడుతున్న ఆగమయ్య

మెట్‌పల్లి(కోరుట్ల): విజ్ఞానం సమాజ వికాసానికి దోహదపడుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు తులసీ ఆగమయ్య అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతీవిద్యార్థి శాస్త్రీయ ఆలోచన కలిగి ఉంటే సమాజ అభివృద్ధి.. తద్వారా దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన కల్పించి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాస రాములు, రత్నాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జేఏసీ కార్యవర్గం



సమావేశమైన నాయకులు

జగిత్యాల: సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న అన్నివిభాగాల ఉద్యోగులతో తెలంగాణ సమగ్ర శిక్షా జాయింట్ యాక్షన్ కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా నారాయణ, గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కోశాధికారిగా చిట్యాల రవి, ఉపాధ్యక్షులుగా అంజయ్య, రాజేందర్, రమేశ్‌ను నియమించారు. జాయింట్ సెక్రటరీలుగా సురేశ్, రాజబాబు, మహేశ్, వెంకటేశ్వర్ రావు, శ్యామ్‌సుందర్, కార్యవర్గ సభ్యులుగా రాము, రవి, శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా అభినయ్, రమేశ్ నియమితులయ్యారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

బుగ్గారం(ధర్మపురి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను ప్రోత్సహించాలని ఇంటర్నల్ మార్కుల వెరిఫికేషన్ టీం సభ్యులు శ్రీనివాస్, సత్యనారాయణ సూచించారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థుల అసైన్‌మెంట్ మూల్యాంకన రికార్డులను మంగళవారం వారు పరిశీలించారు. నాలుగు ఫార్మేటివ్ అసైన్‌మెంట్ రికార్డులు తనిఖీచేశారు. విద్యార్థులు సాధించిన మార్కులపై ఆరా తీశారు. ఉపాధ్యాయులతో వివిధ అంశాలపై చర్చించారు. హెచ్‌ఎం బాలాగంగాధర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బినామీ బిజినెస్!

- మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో తిష్ట
- బినామీలతో జోరుగా వ్యాపారాలు
- వారినుంచి అధిక మొత్తంలో అద్దె వసూలు చేస్తూ..
- బల్దియాకు తక్కువ చెల్లిస్తున్న వ్యాపారులు
- తీవ్రంగా నష్టపోతున్న పురపాలికలు



జగిత్యాల అంగడి బజార్‌లోని మున్సిపల్ వాణిజ్య సముదాయాలు

జగిత్యాల: జిల్లాలోని పలు మున్సిపాలిటీలకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో బినామీలు అడ్డావేశారు. ఇప్పటికీ దశాబ్దాల క్రితం నాటి తక్కువ అద్దె చెల్లిస్తున్నారు. ఏళ్లు గడిచినా రీ టెండర్ నిర్వహించకపోవడం ఇందుకు కారణమని, అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వానికి ఇది నిదర్శనమని విమర్శలు వస్తున్నాయి.

పెరిగిన అద్దెలు..

జిల్లా కేంద్రంగా ఆవిర్భవించాక జగిత్యాలకు వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు పెరిగాయి. వాణిజ్య, వ్యాపార సంస్థలు వృద్ధి చెందుతున్నాయి. కార్పొరేట్‌స్థాయిలో దుకాణాలు, షాపింగ్‌మాల్స్ వెలుస్తున్నాయి. ఇదే క్రమంలో అద్దెలూ పెరుగుతూ వస్తున్నాయి. మున్సిపల్ పార్క్, అంగడిబజార్, పాతబస్టాండ్ సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌కు డిమాండ్ మరింత పెరిగింది. అయితే, ప్రైవేటు దుకాణాలకు అధికంగా అద్దె ఉంటే.. మున్సిపల్ కాంప్లెక్స్‌ల్లో ఏళ్లక్రితం నాటి తక్కువ అద్దె కొనసాగడం విస్మయం కలిగిస్తోంది.

మొత్తం 193 దుకాణాలు

- జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీకి చెందిన మొత్తం దుకాణాలు 193 ఉన్నాయి.
- కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ బల్దియాల్లో స్థలం అందుబాటులో ఉన్నా ఇంకా కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టలేదు.
- జగిత్యాల బల్దియాలోని ఒకట్రెండు తప్ప మిగతా కాంప్లెక్స్‌లు అన్నీ అద్దెకే ఇచ్చారు.
- సుమారు 20 ఏళ్లక్రితం టెండర్లు దక్కించుకున్న వ్యాపారుల నుంచి అప్పుడే మున్సిపల్ ఖజానాకు రూ.10 కోట్ల ఆదాయం వచ్చింది.
- ప్రస్తుతం ఏటా రూ.1,30,18,000 ఆదాయం సమకూరుతోంది.
- ధర్మపురిలోని 7 షాపింగ్ కాంప్లెక్స్‌లకు ఏటా రూ.7,47,600 ఆదాయం సమకూరుతోంది.
- ప్రస్తుతం ప్రైవేట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక్కో దుకాణానికి నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అద్దె పలుకుతోంది.
- బల్దియా కాంప్లెక్స్‌లకు రూ.10 వేల నుంచి రూ.20 వేలకు మించడం లేదంటున్నారు.
- మార్కెట్ ధరలకు అనుగుణంగా రీ టెండర్ ద్వారా దుకాణాలు కేటాయిస్తే బల్దియాలకు అధిక ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికీ 20ఏళ్ల నాటి అద్దెలే

- జగిత్యాల డివిజన్ కేంద్రంగా ఉన్నప్పుడు ఆయా మున్సిపాలిటీలు తమ పరిధిలో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించుకున్నాయి.
- అప్పుడే వాటిని అద్దెకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానించాయి.
- అప్పుడు అంటే సుమారు ఇరవై ఏళ్లక్రితం నిర్ణయించిన అద్దె ఇప్పటికీ చెల్లిస్తున్నారు.
- ఏటా సుమారు 33శాతం అద్దె పెంచాల్సి ఉన్నా.. అది కూడా అమలవుతున్నట్లు కనిపించడంలేదు.
- అంతేకాదు.. గతంలో టెండర్లు దక్కించుకున్న వారు వ్యాపారాలు చేయకుండా ఇతరులకు అధిక అద్దెకు ఇవ్వడంతో బినామీల దందా యథేచ్ఛగా సాగుతోంది.
- నిబంధనల ప్రకారం మూడేళ్లకోసారి టెండర్లు ఆహ్వానించి దుకాణాల నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని బల్దియా అధికారులు చెబుతున్నారు.
- కానీ, గత పాలకవర్గాలు అద్దె గడువు పొడిగిస్తూ వస్తున్నాయి.
- ప్రస్తుతం పాలకవర్గమైనా జోక్యం చేసుకుని టెండర్లు ఆహ్వానించాలనే డిమాండ్ వస్తోంది.

టెండర్లు ఆహ్వానిస్తాం



మున్సిపల్ కాంప్లెక్స్‌ల్లో గదుల అద్దె కోసం టెండర్లు ఆహ్వానిస్తాం. గతంలో టెండర్లు పొందినవారే దుకాణాలు నిర్వహించాలి. వారు ఇతరులకు అద్దెకు ఇవ్వొద్దు. ఇలాచేస్తే చర్యలు తీసుకుంటాం.

– బోనగిరి నరేశ్, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

బల్దియా	కాంప్లెక్స్‌లు	ఆస్తులు
జగిత్యాల	193	28
కోరుట్ల	లేవు	14
ధర్మపురి	7	లేవు

అందరూ బినామీలే..

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు ఇరవై ఏళ్లక్రితం దక్కించుకున్న వారు బల్దియాకు తక్కువ అద్దె చెల్లిస్తున్నారు. కానీ, ఇతరులకు అధిక అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఒకట్రెండు మినహా చాలా దుకాణాల్లో బినామీలే వ్యాపారాలు చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో ప్రజాప్రతినిధులు, అధికారుల పైరవీలతో దుకాణాలు అతి తక్కువకు కోట్ చేసి టెండర్లు దక్కించుకున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.

కౌన్సిలర్ల మొర ఆలకించేదెవరు?

ప్రతీ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో బల్దియా కాంప్లెక్స్‌లకు మళ్లీ టెండర్లు ఆహ్వానించాలని పలువురు కౌన్సిలర్లు పట్టుబడుతున్నారు. కానీ, వారి మాటలు ఎవరూ వినడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

ఆలయ పవిత్రతపై ప్రత్యేక దృష్టి



మ్యాప్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి గర్భగుడిలోకి ఎవరినిపడితే వారిని అనుమతించొద్దని, ఆలయ పరిసరాల్లో అనుమానితులకు ఆస్కారం లేకుండా ఆలయ పవిత్రత కాపాడాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. రవిశంకర్ మంగళవారం అంజన్న ఆలయ అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. గుడి భద్రత కోసం మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాన్ని మూసివేశాక.. లోనికి ఎవరు ప్రవేశించినా వెంటనే శబ్దం వచ్చేలా అలారం ఏర్పాటు చేయాలని సూచించారు. కొండపై ఏళ్లుగాఉంటున్న వారివివరాలు సేకరించాలని చెప్పారు. ఇంజినీరింగ్ అధికారులు.. మెట్లదారి పనులు ప్రారంభించాలని, హనుమాన్ జయంతి నాటికి సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. కొడిమ్యాల, మల్యాల మండలాల్లో సుమారు 816 ఎకరాలు గుర్తించామని తెలిపారు. భూసర్వే పూర్తయితే సీఎం కేసీఆర్ ఇక్కడకు వస్తారని అన్నారు. దేవాదాయ శాఖ భూముల్లోని ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. స్వామి ఆభరణాలకు బీమా ఎందుకు చేయించలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మొక్కలు నాటేందుకు స్థలం గుర్తించాలని తెలిపారు. నీటి ఎద్దడి శాశ్వత పరిష్కారం కోసం వరదకాలువ నుంచి సంతలొద్ది వరకు రూ.13.5 కోట్లతో ఎత్తిపోతల పనులు చేపడతామని పేర్కొన్నారు. ప్రస్తుత అధికారులను మార్చి పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని దేవాదాయ శాఖ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కొండపై నెట్‌వర్క్ సమస్య పరిష్కారానికి సెల్ టవర్ ఏర్పాటు చేయాలన్నారు. హనుమాన్ జయంతికి హాజరయ్యే భక్తులకు హెలిక్యాప్టర్ సేవలు అందిస్తామని ఆయన వెల్లడించారు. జెడ్పీటీసీ కొండపల్కాల రాంమోహన్‌రావు, సర్పంచులు బద్దం తిరుపతిరెడ్డి, మిట్టపెల్లి సుదర్శన్, ఈవో వెంకటేశ్, సింగిల్‌విండో చైర్మన్ రాంలింగారెడ్డి, తహసీల్దార్లు సుజాత, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే ఆర్థికాభివృద్ధి

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత
- స్టాళ్లు పరిశీలించిన కలెక్టర్ యాస్మిన్ బాషా



సదస్సు ప్రారంభిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత తదితరులు

జగిత్యాలఅగ్రికల్చర్: మహిళల ఆత్మవిశ్వాసంతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్‌బాషా అన్నారు. స్థానిక పొన్నాల గార్డెన్‌లో మహిళల వ్యాపారాభివృద్ధి, ఆవిష్కరణలకు 'అవకాశాలు–సవాళ్లు' అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. తొలుత దావ వసంత మాట్లాడుతూ, చిన్న, మధ్య, భారీ తరహా పరిశ్రమలు స్థాపించి, మరో పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కోరారు. ప్రస్తుతం అసాధారణ ప్రతిభ చూపిస్తూ కార్పొరేట్ కంపెనీల సీఈవోలుగా, సీఎండీలుగా ఎదుగుతున్నారని అన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, ప్రస్తుతం నాణ్యమైన ఆహార ఉత్పత్తులు లభించడం లేదని, ఈక్రమంలో మహిళలు తయారు చేసిన నాణ్యమైన ఆహార ఉత్పత్తులకు ఎప్పటికీ డిమాండ్ ఉంటుందని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ లత మాట్లాడుతూ, మహిళలు తయారు చేసిన ప్రతీవస్తువుకు బ్రాండ్ ఇమేజ్ సంపాదించాలన్నారు. టీ లైఫ్ సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు దీపికారెడ్డి మాట్లాడుతూ, మహిళలు అన్నిరంగాల్లో చొచ్చుకువెళ్తున్నా.. వ్యాపార రంగంలోకి రాలేకపోతున్నారన్నారు. అనంతరం మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల స్టాల్స్‌ను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు.. అవరోధాలు ఎదుర్కొని రెండు చేతులు లేకున్నా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న ఆయేషా, భర్త చనిపోయిన ఇద్దరు చిన్నారులను పోషించడంతోపాటు పెట్రోల్ పంపును విజయవంతంగా నడిపిస్తున్న పద్మను కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల ట్రస్ట్ చైర్‌పర్సన్ లత, టీ–లైఫ్ జిల్లా అధ్యక్షురాలు పొన్నాల శిరీష, డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత చదివా..

'మహిళలకు పుట్టింట్లో, మెట్టింట్లో అనేక సమస్యలు ఉంటాయి.. ఆ వాటిని చూసి జడిసిపోకూడదు.. అక్కడే ఆగిపోగూడదు.. అవరోధాలను అధిగమించాలి.. మనమేంటో నిరూపించుకోవాలి' అని కలెక్టర్‌గా ఎలా ఎంపికయ్యానో మహిళలకు వివరించే ప్రయత్నం చేశారు కలెక్టర్ యాస్మిన్ బాషా. అందరు మహిళల్లాగే తనకూ పెళ్లి అయ్యిందని, ఇద్దరు పిల్లలు పుట్టారని, కానీ, వంట చేయడం, పిల్లలను చూసుకోవడం ఇదేనా? జీవితం అన్పించిందన్నారు. అప్పుడే.. కుటుంబసభ్యుల సహకారంతో చదవడం ప్రారంభించానని, ఆషామాషీగా కాదని ఇష్టపడి చదివానని అన్నారు. అనుకున్నది సాధించాలనుకుని కష్టపడ్డానని, చివరకు లక్ష్యం సాధించానని చెప్పారు. ఇప్పుడు కలెక్టర్ స్థాయికి చేరుకోవడం, మీ ముందు ఇలా మాట్లాడటం ఆనందంగా ఉందన్నారు. మహిళలను మోటివేట్ చేయాలంటూ చాలా సమావేశాలకు పిలుస్తారు కానీ..తన దృష్టిలో 'ఎవరో మోటివేట్ చేస్తే మనం మారడం కాదు.. మనకు మనమే మారాలి.. అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించడం సులభమవుతుంది' అన్నారు.

కోరుట్ల బడ్జెట్ రూ.42.39కోట్లు

- ఆమోదించిన కౌన్సిల్ సభ్యులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: మున్సిపల్ 2023–2024 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రత్యేక సమావేశాన్ని చైర్‌పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ముఖ్య అతిథిగా, అదనపు కలెక్టర్ మకరంద ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2023–2024 ఆర్థిక సంవత్సరానికి రూ.42.39 కోట్లతో ప్రతిపాదించిన బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. తెలంగాణ పురపాలక చట్టం – 2019, సెక్షన్ 107ను అనుసరించి బడ్జెట్ రూపకల్పన చేసినట్టు చైర్‌పర్సన్ అన్నం లావణ్య తెలిపారు. బడ్జెట్‌లో హరితహారం, పారిశుద్ధ్యం, విద్యుత్ చార్జీలు, రుణాల చెల్లింపులకు నిధులు కేటాయించారు. ఉద్యానవనాలు, ఆటస్థలాలు, శ్మశానవాటికలు, పబ్లిక్ టాయిలెట్లు, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణాలకు నిధులు కేటాయించారు. ఆధునిక కబేళాలు, డంపింగ్ యార్డుల శాస్త్రీయ నిర్వహణ, నిర్మాణం, సాలిడ్, లిక్విడ్ మేనేజ్‌మెంట్ కోసం నిధులు సమకూర్చారు. రూ.128.80 లక్షల మిగులు బడ్జెట్‌లో 25 శాతం మౌలిక వసతుల కల్పన, విలీన ప్రాంతాల అభివృద్ధి, అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీన వర్గాల ప్రాంతాలు, మైనారిటీ ప్రాంతాల్లోని మురికివాడల్లో అభివృద్ధి కోసం కేటాయింపులు చేశారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కోరుట్లను అత్యుత్తమ పట్టణంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కమిషనర్ ఎండీ ఆయాజ్, డీఈఈ అభినయ్, ఏఈ లక్ష్మీ, జేఏవో శివ, మేనేజర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

నృసింహుని హుండీ లెక్కింపు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి హుండీని మంగళవారం లెక్కించారు. రూ.41,34,313 నగదు సమకూరినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. గతేడాది డిసెంబర్ 9 నుంచి ఈఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు భక్తులు సమర్పించి, కట్న, కానుకల ద్వారా ఈ మొత్తం సమకూరినట్లు వివరించారు. దీంతోపాటు 75 గ్రాములు మిశ్రమ బంగారం, 5.420 కేజీల మిశ్రమ వెండి, 124 విదేశీ కరెన్సీ నోట్లు సమకూరినట్లు తెలిపారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, రెనోవేషన్ కమిటీ సభ్యులు రామన్న, పద్మ, రవీందర్ పాల్గొన్నారు.

నేడు బీజేపీలోకి శ్రావణి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ బోగ శ్రావణి బుధవారం కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ సమక్షంలో ఢిల్లీలో బీజేపీలో చేరనున్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ నేతృత్వంలో శ్రావణితోపాటు పలువురు నాయకులు కాషాయ కండువా కప్పుకోనున్నారు. రాష్ట్రంలో ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నందున బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్, పార్టీ జాయినింగ్స్ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నారు.

సీఎంఆర్.. ఇదేం తీరు?

- గడువు మీద గడువు పెంపు
- అయినా అందని బియ్యం
- 100 శాతం మిల్లింగ్‌పై సందేహాలు
- ప్రభుత్వ ధాన్యంతోనే దందా
- నామమాత్రపు పర్యవేక్షణ.. చర్యలు కరువు



ఏడాది క్రితం కరీంనగర్ జిల్లా రామడుగులో అక్రమంగా వెలుగుచూసిన రైస్‌మిల్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: గడువుల మీద గడువు పెంచుతున్నా మిల్లర్లలో మార్పులేదు. పలువురు మిల్లర్లు మరాడించిన బియ్యాన్ని వక్రమార్గం పట్టిస్తుండగా కఠినచర్యలు కరువవడం ఆందోళనకర పరిణామం. ఏళ్లుగా బకాయి ఉన్న మిల్లర్లు ఉండగా ఇంకా సదరు వసూలులో ఎనలేని నిర్లక్ష్యం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మరాడించి బియ్యంగా ఇవ్వాలని రైస్‌మిల్లులకు సరఫరా చేయడం ప్రతి యాసంగి, వానాకాలం సీజన్‌లో జరిగే తంతు. అధికారులతో ఉన్న అనుబంధమో మరేమో కానీ పలు మిల్లులు ఇంకా సీఎంఆర్ ఇవ్వడంలో అట్టడుగున ఉండటం శోచనీయం. మంగళవారంతో గడువు ముగిసిన నేపథ్యంలో మిలర్లు వందశాతం మిల్లింగ్ చేసి ఇస్తారా? అన్నది అనుమానమే. మళ్లీ గడువు పెంపుపైనే పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది.

పెట్టుబడి లేని దందా

ఉమ్మడిజిల్లాలో పలు రైస్‌మిల్లులు రేషన్‌బియ్యానికి అడ్డాగా మారాయి. రేషన్ బియ్యం కొనుగోలు చేసి వాటిలోనే కర్నెల్స్ కలిపి ఎఫ్‌సీఐకి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. కేటాయించిన సీఎంఆర్ లక్ష్యం మేరకు బియ్యాన్ని అప్పగిస్తే దందా చేసుకునేందుకు అవకాశముండదు. ఒకవేళ మిల్లులో తనిఖీలు జరిగితే డొల్లతనం బయటపడుతుందన్న కారణంతో సదరు కిటుకును ఉపయోగించి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ సొమ్ముతో దర్జాగా దందా చేస్తుండగా మిల్లర్లకు కాసుల వర్షం కురుస్తోంది. గతంలో కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని ఓ రైస్‌మిల్లుకు ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యమే లేకపోవడాన్ని గుర్తించి అధికారులు కంగుతిన్నారు. ఒక ఏసీకేకు 270 క్వింటాళ్లు కాగా 14 ఏసీకేలకు గానూ 3,780 క్వింటాళ్లు. 14 ఏసీకేలకు గానూ క్వింటాల్ ధాన్యం లేకపోవడం.. రికార్డులను తరచిచూస్తే ఎఫ్‌సీఐకి సరఫరా చేసిన బియ్యమే లేకపోవడంతో నిర్ఘాంతపోవడం అధికారుల వంతయ్యింది.

మరో రెండు రోజుల్లో మరాడించి ఇస్తారా?

ఒక సీజన్‌కు సంబంధించిన కోటాను తర్వాతి సీజన్ సరుకు చేతికందే నాటికి పూర్తి చేయాలి. కానీ ప్రభుత్వం వివిధ కారణాలతో గడువు పొడిగిస్తుండటం మిల్లర్లకు లాభిస్తోంది. కేటాయించిన సీఎంఆర్ ప్రకారం వందశాతం సరఫరా చేయాలని ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించింది. గత నెల రోజుల క్రితం మరోసారి అవకాశమిస్తూ ఫిబ్రవరి 28 వరకు తుది గడువుగా పేర్కొన్నారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల అధికారులు ఈ మేరకు జిల్లా స్థాయిలో మిల్లర్లతో సమీక్షలు నిర్వహిస్తున్నా మార్పు అంతంతే. మార్చి నెలాఖరు నాటికి యాసంగి ధాన్యం చేతికందనుండగా ఆ లోపు సీఎంఆర్ పూర్తవడం కష్టమే.

కేసులైనా మార్పేదీ..

2011–12 నుంచి 2014–16 వరకు ఉమ్మడి జిల్లా పరిధిలో 18మిల్లులు సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన 90,407 క్వింటాళ్ల బియ్యాన్ని ఇవ్వలేదు. సదరు మిల్లులపై పౌరసరఫరాలశాఖ గతంలోనే కేసులు నమోదు చేయించింది. కేసులు నమోదై ఏళ్లు గడుస్తున్నా ఒక్క మిల్లరు బకాయి సీఎంఆర్ ఇవ్వకపోవడం పర్యవేక్షణ తీరుకు తార్కాణం. రెవెన్యూ రికవరీ(ఆర్ఆర్) యాక్ట్ ప్రయోగిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించినా మిల్లర్లలో మార్పు లేదు. సదరు యాక్ట్ కింద మిల్లుల ఆస్తుల వేలం వేసైనా ఆ మొత్తం వసూలు చేయొచ్చు. కాగా సీఎంఆర్ బకాయిలను వసూలు చేస్తామని, కోర్టుకు వెళ్లడం వల్ల ఆలస్యమవుతోందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

గాడి తప్పిన పర్యవేక్షణ

2019 వానాకాలంలో సీఎంఆర్ కోటా పూర్తి చేయని మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టారు. ఉమ్మడి జిల్లాలోని పలు మిల్లుల్లో ధాన్యం మాయంచేయగా సదరు డబ్బులు చెల్లించడంతో బ్లాక్‌లిస్ట్ నుంచి బయటపడ్డాయి. నాలుగు జిల్లాల్లో సుమారు 350 మిల్లులు ఇంకా బకాయిలు ఉన్నాయి. 10 ఏసీకేల నుంచి 20 ఏసీకేల వరకు మిల్లులు బకాయి ఉండటం పర్యవేక్షణ తీరుకు అద్దం పడుతోంది. సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాల్సి ఉండగా అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవు. పలుకుబడి మిలర్లు సీఎంఆర్‌తో వ్యాపారం చేస్తున్నట్లు పౌరసరఫరాల విజిలెన్స్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో పలుమార్లు వెల్లడైంది.

ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ తీరిలా (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	లక్ష్యం	బకాయి
కరీంనగర్	2,65,228	43,729
పెద్దపల్లి	3,95,431	54,938
జగిత్యాల	1,01,480	36,377
రాజన్న సిరిసిల్ల	98,456	15,403

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు మంత్రికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వానం అందజేస్తున్న ఈవో

ధర్మపురి : ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 3 నుంచి ప్రారంభం కానున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు నిర్మల్‌లోని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, కమిషనర్లకు ఆలయం తరుపున ఆహ్వానం అందజేశారు. అనంతరం స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలను అందజేశారు. ఇక్కడ దేవస్థానం ఈవో శ్రీనివాస్, రేనవేషన్ కమిటీ సభ్యులు రామన్న, వేద పండితులు తదితరులున్నారు.

ఫిట్‌నెస్ లేని వాహనాలకు జరిమానా



డ్రైవర్‌తో మాట్లాడుతున్న ఎంవీఐ రంజిత్

కథలాపూర్: కోరుట్ల - కథలాపూర్ రహదారిలో ఎంవీఐ రంజిత్ ఆధ్వర్యంలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆటోలకు జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని వాహనాలకు రూ. 3.50 లక్షలు జరిమానా విధించినట్లు ఎంవీఐ రంజిత్ తెలిపారు.

గల్ఫ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



నివాళి అర్పిస్తున్న అడ్లూరి లక్ష్మణ్

ధర్మపురి : గల్ఫ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండు చేశారు. ధర్మపురికి చెందిన వొజ్జల శ్రీనివాస్ ఫిబ్రవరి 14న సౌదీలో గుండెపోటుతో మృతిచెందగా సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి శ్రీనివాస్ మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. రాష్ట్రంలో జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి వివిధ కారణాలతో మృతిచెందిన వారు ఎందరో ఉన్నారన్నారు. ఇక్కడ నాయకులు వేముల రాజేష్, సీపతి సత్యనారాయణ తదితరులున్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు తెలిపారు. 1న ఆర్థోపెడిక్, 10న విజువల్, 15న ఆర్థోపెడిక్, 24న ఇయరింగ్, 29న ఆర్థోపెడిక్, 31న ఎంఆర్ శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దివ్యాంగులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పారదర్శకతకు 'లెర్నింగ్ యాప్'

- 'తొలిమెట్టు' పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక యాప్
- అందుబాటులోకి తీసుకువచ్చిన విద్యాశాఖ
- విద్యార్థుల సామర్థ్యాలు యాప్‌లో నిక్షిప్తం

జగిత్యాల జిల్లా ప్రొఫైల్ :

రెవెన్యూ డివిజన్లు	: 3
మండలాలు	: 20
ప్రాథమిక పాఠశాలలు	: 511
ప్రాథమికోన్నత పాఠశాలలు	: 85
విద్యార్థులు	: 35, 632



గొర్రెపల్లి ప్రాథమికోన్నత పాఠశాల

మల్లాపూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు గత ఆగస్టు నుంచి విద్యాశాఖ తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించడంతో పాటు విద్యార్థుల ప్రగతిని పరిశీలించేందుకు విద్యాశాఖ ఇటీవల స్టూడెంట్ లెర్నింగ్ ట్రాకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌లో ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేస్తున్నారు. దీనిద్వారా విద్యార్థుల ప్రగతి, విద్యా ప్రమాణాలు తెలుసుకునే అవకాశం ఉంది.

నామమాత్ర తనిఖీ ఉండకుండా..

జిల్లాలో 511 ప్రభుత్వ ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా వీటిలో 35, 632 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రధానంగా ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం , అక్షరాలు గుర్తించేందుకు ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈవో, సెక్టోరియల్, మండల నోడల్ అధికారులు, ఎంఈవోలు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శిస్తున్నారు. వీరికి జిల్లాస్థాయి డీఆర్పీ, ఎమ్మార్పీలు సహకారం అందిస్తున్నారు. నామమాత్రంగా తనిఖీ నిర్వహించకుండా పారదర్శకతను పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబిస్తున్నారు.

అభ్యసనా సామర్థ్యాలు నమోదు..

పాఠశాలల్లో తనిఖీ కోసం వెళ్లే అధికారులు విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను స్టూడెంట్ లెర్నింగ్ ట్రాకింగ్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. జీపీఎస్ అనుసంధానం ఉండడంతో అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షణ చేస్తున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయి, ప్రగతి పాఠశాలలో ఎలా నమోదు చేస్తున్నారన్న దానిపై మరోసారి ఈ యాప్ ద్వారా మానిటరింగ్ బృందం పరిశీలిస్తోంది. కాగా తరగతిలో ఒకరిద్దరిని పరీక్షిస్తున్నారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా వారంలో ఐదురోజుల పాటు బోధనా, మరోరోజు మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. ప్రతినెలా చివరి వారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి లోపాలను సవరిస్తున్నారు.

విద్యార్థుల ప్రగతి తెలుసుకోవచ్చు



విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలిమెట్టు కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా కొనసాగుతోంది. పాఠశాల స్థాయిలో పర్యవేక్షణము మ్మరం చేస్తున్నాం. ప్రతీ విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. దీంతో ఉపాధ్యాయుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది.

–జగన్మోహన్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి, జగిత్యాల

మాస్టర్‌ప్లాన్ రద్దుపై ప్రకటన విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్ : రైతుల హక్కులను హరించేలా ఉన్న మాస్టర్‌ప్లాన్ రద్దుపై ప్రభుత్వం వెంటనే ప్రకటన విడుదల చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. మాస్టర్‌ప్లాన్ ముసాయిదా గడువు నేటితో ముగియడంతో ప్రభావిత గ్రామాల రైతులు, ప్రజలతో కలిసి మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బోనగిరి నరేశ్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను వదిలేసి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మోతె, తిమ్మాపూర్, తిప్పన్నపేట, లింగంపేట, నర్సింగాపూర్ గ్రామాల్లో రైతుల సొంత భూములను రిక్రియేషన్, ఇండస్ట్రియల్, పబ్లిక్, సెమీ పబ్లిక్ జోన్లలో చేర్చడంతో రైతులు ఆందోళన బాటపట్టారన్నారు. ఇండస్ట్రియల్ జోన్లు జనావాసాలకు దూరంగా ఉండాలన్న హరిత ట్రిబ్యునల్ ఆదేశాలకు భిన్నంగా ప్రజలు నివాసం ఉంటున్న తిప్పన్నపేట గ్రామాన్ని ఇండస్ట్రియల్ జోన్‌గా చేర్చడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండ శంకర్ బల్దియా ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య, నాయకులు గాజుల రాజేందర్, గాజంగి నందయ్య, పుప్పాల అశోక్, చందా రాధాకిషన్, రైతులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు వేయించాలి

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గోపాలకృష్ణమూర్తి



నట్టల నివారణ మందు వేస్తున్న అధికారులు

గొల్లపల్లి: జీవాలకు నట్టల నివారణ మందును వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గోపాల కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని వెన్గుమట్లలో గొర్రెలకు నట్టల నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్క శంకరయ్య, సర్పంచ్ గుడ్ల లక్ష్మీ, రాజేశం, సత్తయ్య, తిరుపతి పాల్గొన్నారు.

గొల్లపల్లిలో...

మండల కేంద్రంలో వైస్ ఎంపీపీ ఆవుల సత్యం గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందు వేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మారం శేఖర్, సిబ్బంది మతీన్, సతీశ్, రామ్, గంగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ అవయవదానం



స్వప్న(ఫైల్)

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన పానగంటి స్వప్న (45) మృతిచెందగా ఆమె అవయవాలను కుటుంబీకులు దానం చేశారు. స్వప్న నాలుగు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురికాగా చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందే ముందు భర్త నర్సయ్య సూచనల మేరకు తన రెండు కిడ్నీలు, గుండెను ఆస్పత్రి వారికి దానం చేసింది. కాగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, సర్పంచ్ మేసు ఏసుదాసు, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్, టీఆర్ఎస్ నాయకుడు , మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

దుబాయిలో గుండెపోటుతో వలసజీవి మృతి

- మృతుడి స్వగ్రామం గట్టుభూత్కూర్



వేమారెడ్డి (ఫైల్)

గంగాధర(చొప్పదండి): మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన కంకణాల వేమారెడ్డి (42) దుబాయిలో మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. వేమారెడ్డికి భార్య ప్రకృత, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయన ఉపాధి నిమిత్తం ఎనిమిదేళ్లుగా దుబాయి వెళ్తున్నాడు. ఏడాది క్రితం ఇంటికి వచ్చి, మళ్లీ వెళ్లాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం గుండెపోటు వచ్చి, మృతిచెందినట్లు స్నేహితులు అతని కుటుంబసభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. మృతుడి కుటుంబసభ్యులను సర్పంచు విజయేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డిలు పరామర్శించారు. రెండు రోజుల్లో వేమారెడ్డి మృతదేహం స్వగ్రామం చేరుతుందని సర్పంచు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): మండలంలోని వెంకటేశ్వరపల్లికి చెందిన పుల్లూరి ప్రవీణ్(27) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్ర కారం.. ప్రవీణ్ డ్రైవర్‌గా పని చేసేవాడు. అతని తండ్రి రాజయ్యకు పక్షవాతం వచ్చి, కొన్నేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. దీనికితోడు కుటుంబ సమస్యలతో ప్రవీణ్ మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి లచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు జమ్మికుంట టౌన్ సీఐ రామచందర్‌రావు తెలిపారు. మృతుడికి అన్న ప్రశాంత్, ఇద్దరు అక్కలు ఉండగా అక్కలకు పెళ్లిళ్లయ్యాయి.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



నిమ్మితను అభినందిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్రావ్‌పేటలోని మహాత్మా జ్యోతి బాపులే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన 9 తరగతి విద్యార్థిని బి.నిమ్మిత రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటింది. హన్మకొండలో జరిగిన పోటీల్లో రేస్‌వాక్ విభాగంలో రాణించి సిల్వర్ పతకాన్ని సాధించింది. పట్టణంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోటగిరి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పద్మశాలీ సదస్సులో మల్యాల వాసులు



సదస్సులో పాల్గొన్న వడ్లెపల్లి శ్రీనివాస్, భోగ ప్రభాకర్

మల్యాల (చొప్పదండి) : దుబాయ్ గ్లోబల్ సమ్మిట్‌లో మల్యాల మండల కేంద్రానికి చెందిన ఎన్ఆర్ఐ వడ్లెపల్లి శ్రీనివాస్, భోగ ప్రభాకర్ పాల్గొన్నారు. నిరుపేదలకు ఉచితంగా పుస్తకాల పంపిణీ, గ్రామాభివృద్ధికి ట్రాక్టర్‌తోపాటు తమవంతు సేవలందిస్తున్నారు. దుబాయ్‌లో జరిగిన నార్త్ అమెరికన్ పద్మశాలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో వడ్లెపల్లి శ్రీనివాస్, భోగ ప్రభాకర్ చేపడుతున్న సామాజిక సేవలను గుర్తించి సదస్సు నిర్వాహకులు ఇరువురిని అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

మెట్‌పల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని జెడ్పీ చైర్‌పర్సన్‌ దావవసంత, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సూచించారు. మండలంలోని రాం లచ్చక్కపేటలో గ్రామస్తులు నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామస్తులు కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. గ్రామస్తులు సమిష్టిగా ఉంటేనే గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచ్ గజ్జెల నరేశ్, ఉప సర్పంచ్ పాలెపు రాజ గంగారాం తదితరులున్నారు.

సామాజిక మిత్రుల ఔదార్యం

- క్యాన్సర్ బాధితుడికి రూ. 1.46 లక్షలు ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి డిపాజిట్ బాండ్‌ను అందజేస్తున్న మేనేజర్

ధర్మపురి : ఓ వైపు పేదరికం... మరోవైపు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ నిరుపేదకు వైద్యం చికిత్సకోసం ఫేస్‌బుక్ మిత్రులు రూ.1.46 లక్షలు ఆర్థిక సాయంగా అందించి ఔదార్యం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపెల్లి జిల్లా ఎలిగేడుకు చెందిన పూసాల స్వామికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఉపాధి కోసం ముంబై వెళ్లగా క్యాన్సర్ బారినపడడంతో తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. కూతుళ్లు చదువుకుంటుండగా భార్య కూలీ పనులకు వెళ్తోంది. కొంతకాలంగా స్వామి తన అత్తగారింట్లో కుటుంబ సభ్యులతో కలిసి వెల్గటూర్ మండలంలోని పైడిపెల్లి గ్రామంలో ఉంటున్నాడు. కుటుంబ పోషణ, వైద్యఖర్చులు మరింత భారంగా మారాయి. బాధితుడి సమస్యను ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ తన మిత్రుల ద్వారా తెలుసుకొని వైద్యం కోసం ఆర్థికసాయం అందించాలని గతనెల 4న ఫేస్‌బుక్‌లో వివరాలను పోస్ట్‌చేశాడు. దీనికి స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, పలువురు దాతలు రూ.1.46 లక్షలు విరాళాలు అందించారు. అత్యవసరాల కోసం స్వామి కూతురు స్వరూప పేరుపై రూ.25 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి ధర్మపురి యూనియన్ బ్యాంకు మేనేజర్ రవితేజతో కలిసి పంపిణీ చేశారు. మిగిలిన విరాళాలు స్వామివైద్యం ఖర్చులకు వినియోగించనున్నట్లు రమేశ్ తెలిపాడు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్ : ఇటీవల నర్సింగాపూర్‌లో ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న జలపతి రెడ్డి కుటుంబానికి జగిత్యాల జిల్లా రెడ్డి జన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.2,11,500లను ఆర్థికసాయంగా మంగళవారం అందజేశారు. ఇక్కడ సంఘం అధ్యక్షుడు డాక్టర్ శైలేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముస్కు గోపాల్ రెడ్డి, సభ్యులు సంత గౌతమ్ రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, మల్లారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ వైపే అన్నిపార్టీల నాయకులు

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి

జగిత్యాలజోన్ : ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్‌లో మంగళవారం రాత్రి బీజేపీ జిల్లా బీజేపీ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కార్నర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్నిపార్టీల నాయకులు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అసమర్థ విధానాలే రానున్న ఎన్నికల్లో బీజేపీకి పట్టం కడతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు పన్నాల తిరుపతి రెడ్డి, డాక్టర్ శైలేందర్ రెడ్డి, నలువాల తిరుపతి పాల్గొన్నారు.

డిపాజిట్‌దారుల ఆందోళన



కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డిపాజిట్‌దారులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఓ చిట్‌ఫండ్స్‌లో చిట్టీ గడువు ముగిసినా డబ్బులు చెల్లించడం లేదంటూ డిపాజిట్‌దారులు కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. అనంతరం అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని సిబ్బంది వారికి సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడ్డ భిక్షపతి

కథలాపూర్(వేములవాడ): కోరుట్ల– వేములవాడ మార్గంలోని కథలాపూర్ మండలం ఇప్పపెల్లి శివారులో మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు కథనం ప్రకారం.. మెదక్ జిల్లా చిన్నకోడూర్ మండలం రామంచ గ్రామానికి చెందిన రాచకొండ భిక్షపతికి ఈ ప్రమాదంలో కాలు, చేయి విరిగి తీవ్ర గాయాలయ్యాయి. భిక్షపతి తన స్వగ్రామం నుంచి మేడిపెల్లి మండలం మన్నెగూడెంలో ఉంటున్న తన సోదరి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో ఇప్పపెల్లి శివారులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భిక్షపతి చేయి, కాలు విరిగింది. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం జగిత్యాల ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నర్స్ బలవన్మరణం

కరీంనగర్‌క్రైం: ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తున్న నర్స్ ఆత్మహత్య చేసుకుంది. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని గాంధీరోడ్‌లో నివాసముంటున్న కొయ్యడ శ్యామల (35)కు 2007లో వివాహమవగా ఒక పాప ఉంది. తర్వాత ఆమెకు భర్తతో విడాకులయ్యాయి. శ్యామల నర్సింగ్ కోర్సు చేస్తున్న సమయంలో జైభీంతో ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారితీసింది. పస్తుతం ఆమె ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తుంది. శ్యామలను పెళ్లి చేసుకుంటానని నమ్మించిన జైభీం మరొకరిని చేసుకున్నాడు. అప్పటినుంచి శ్యామలను వేధింపులకు గురిచేస్తున్నాడు. గత నెల 27న రాత్రి ఇద్దరికీ గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన ఆమె అదే రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. జైభీం వేధింపుల వల్లే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి రాజమ్మ మంగళవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి స్టేజి సమీపంలో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మానకొండూరు మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన గంగినేని సుధాకర్ తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తన ద్విచక్ర వాహనంపై చెంజర్ల నుంచి కరీంనగర్ వెళ్తున్నాడు. ఇదే సమయంలో ఈదులగట్టెపల్లి స్టేజి సమీపంలో స్పీడ్ బ్రేకర్ల వద్ద ఆటో నెమ్మదిగా వెళ్తోంది. వెనకాల వస్తున్న సుధాకర్ ఆ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

దివ్యాంగులకు రుణాలు

జగిత్యాల: జిల్లాలోని దివ్యాంగులు వ్యాపారం చేసుకునేందుకు రుణాలు ఇవ్వనున్నట్లు జిల్లా సంక్షేమ ధికారి బోనగిరి నరేశ్ తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి పునరావాస పథకం కింద ఇచ్చే రుణాలకు 21–50 ఏళ్ల వయస్సుగల దివ్యాంగులు అర్హులన్నారు. ఈనెల 6వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.